www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 23 నవంబరు 2022

సంక్రాంతిలోపు జగనన్న ఇళ్లు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్రాంతిలోపు జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా జెడ్‌పి సిఇఒ రవికుమార్ అన్నారు. పట్టణంలో నాగిరెడ్డిగూడెం లే అవుట్ వద్ద జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు మంగళవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వెలుగు కార్యాలయం నుంచి రూ.35 వేలు లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఎపిఎంని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి గృహ నిర్మాణాలు పూర్తయితే అందరూ గృహ ప్రవేశాలు చేసుకుంటారన్నారు. పనులు వారం వారం పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి, ఎంపిడిఒ మణికుమారి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాన పనులు పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

కొత్త విధానం.. కొంపముంచే..!

ధాన్యం కొనుగోలుపై రైతుల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం
వాహనాల్లేక ఎక్కడి ధాన్యం అక్కడే
వెంటాడుతున్న వర్షాలు
రోడ్లపై, కల్లాల్లోనే ధాన్యపురాసులు
60 శాతంపైగా మాసూలు పూర్తి
ఇప్పటి వరకు ఏడుశాతమే కొనుగోలు
బిల్లుపై ట్రక్కుషీట్ ఇవ్వకపోడంతో రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తెచ్చిన కొత్తవిధానం తమ కొంపముంచిందంటూ రెండు జిల్లాల రైతాంగం నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ఆరుగాలం పండించిన పంటంతా కల్లాల్లోనూ, రోడ్లపైనే ఉండిపోవడం, అల్పపీడన ప్రభావంతో వెంటాడుతున్న వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వరిసాగులో ఉభయగోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మండలాల్లోని అధికారులు, రైతుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ దాదాపు 60 శాతం వరకూ మాసూలు పూర్తయ్యాయి. రైతులు ధాన్యం అరబెట్టి రోడ్లపైనా, కల్లాలోనే రాసులు చేసి ఉంచారు. ధాన్యం మాత్రం కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. గతంలో కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ కమీషన్ వ్యాపారులు కూడా ధాన్యం కొనుగోలు చేసేవారు. ప్రభుత్వం ఈసారి ధాన్యం కొనుగోలులో నూతన విధానం తెచ్చింది. కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు జరగాలని నిర్ణయించింది. కానీ అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వతీరుతో వరిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 3.80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం నిర్దేశించుకోగా ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యం కేవలం 26 వేల టన్నులు మాత్రమే. అంటే ఏడుశాతం మాత్రమే ధాన్యం కొనుగోలు జరిగింది. మిగిలిన ధాన్యం ఎప్పటికి కొనుగోలు చేస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ధాన్యం కొనుగోలు మందకొడిగానే సాగుతున్న పరిస్థితి ఉంది.

లారీల ఏర్పాటులో విఫలం

రైతులు ధాన్యం ఒబ్బిడిచేసి, ఆరబెట్టి సిద్ధంగా ఉంచినప్పటికీ రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయలేకపోతున్నారు. గతేడాది వరకూ రైతులు ధాన్యం ఆరబెట్టి రాసులు చేసిన తర్వాత వ్యాపారులే జట్టు, లారీలను పంపించి ధాన్యం కొనుగోలు చేసేవారు. కొత్తవిధానంలో అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. రైతులు కల్లాలో ధాన్యం అమ్ముకునే పరిస్థితి నుంచి లారీల కోసం, జట్టుకోసం, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది, రైతు తనపొలం మాసూలు చేసి ధాన్యం అరబెట్టిన తర్వాత తొలుత రైతుభరోసా కేంద్రంలో కలవాలి. తర్వాత టెక్నికల్ అసిస్టెంట్, వాలంటీర్ వెళ్లి తేమశాతం పరిశీలిస్తారు. తర్వాత ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేసేది యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైతుకు ఎకరాకు 40 కిలోలు తూగే 65 సంచులు ఇస్తారు. ఎక్కువ ధాన్యం పండితే ఏంచేయాలో ఇప్పటికీ తేల్చలేదు. తర్వాత జట్టును రైతే చూసుకోవాలి. ఇవి పూర్తయిన తర్వాత రైతుభరోసా కేంద్రం అధికారులు లారీ పంపిస్తారు. ధాన్యం లోడు చేసి వేబ్రిడ్జిపై తూకం తూసిన తర్వాత ట్రక్కుషీట్ తీస్తారు. అప్పటి వరకూ ఏ మిల్లుకు ధాన్యం వెళ్తుందో కూడా రైతులకుగానీ, అధికారులకుగానీ తెలీదు. ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసిన రైతులకు జట్టు కూలీలు దొరుకుతున్నారు. తక్కువ విస్తీర్ణం సాగుచేసిన రైతులకు జట్టు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రైతులు ధాన్యం ఆరబెట్టి సిద్ధంగా ఉన్నారు. లారీలు సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీంతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయింది.

ఉంగుటూరు మండలంలో ధాన్యపు రాసులు

దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షానికి ధాన్యం తడిసిపోతుందని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. లారీలు ఏర్పాటు చేయడం, సంచులు అందించడంలో సరైన చర్యలు లేకపోవడంతో రైతులు నలిగిపోతున్నారు. దీంతో కొత్తవిధానం తమకొంప ముంచిందంటూ రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

జట్టు బిల్లు ఎప్పుడిస్తారు..!

గతంలో ధాన్యం విక్రయించడం వరకే రైతు బాధ్యత ఉండేది. సంచులు, జట్టు బిల్లు, లారీలు అన్నీ మిల్లర్లు చూసుకునేవారు. ఇప్పుడు అన్నీ రైతులే చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జట్టు బిల్లు, లారీ మామూలు రూ.1300 కలిపి మొత్తం 75 కిలోల బస్తాకు రూ.22 వరకూ ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఖర్చులను ప్రభుత్వం ఇస్తుందని చెబుతున్నప్పటికీ ఎప్పుడిస్తారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ధాన్యం సొమ్ముకు ట్రక్కుషీటు తీస్తున్న అధికారులు, ఖర్చులకు సంబంధించి మాత్రం ట్రక్కుషీటు ఇవ్వడంలేదని రైతులు చెబుతున్నారు. దీంతో ఇస్తారా.. ఇవ్వరా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. దీనిపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. సొంతంగా వాహనాలు పెట్టుకుని ధాన్యం తీసుకొచ్చే రైతులకు కిరాయి సొమ్ము ఎప్పుడిస్తారో కూడా రైతులకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

అధికారుల స్పందన కరువు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులతో రెండు జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన ఆ శాఖ అధికారుల నుంచి సరైన స్పందన లేకుండా పోయింది. ఏలూరు జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ అధికారులుగానీ, పశ్చిమగోదావరి జిల్లా పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారులు గానీ ధాన్యం కొనుగోలుపై స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లాకలెక్టర్లు, జెసిలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నప్పటికీ ఆ శాఖ అధికారుల్లో మాత్రం స్పందన లేకపోవడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఎప్పటికప్పుడు మీడియాకు సమాచారం ఇచ్చి రైతులకు భరోసా కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

లారీల్లేక ధాన్యం కొనగోలు జరగడం లేదు

లంకా వెంకటేశ్వరరావు, బొమ్మిడి

20 ఎకరాల్లో వరిసాగుచేశాను. ధాన్యం రాసులు చేసి ఉంచాం. ఒకపక్కవర్షం వెంటాడుతోంది. లారీలు లేకపోవడంతో ధాన్యం కొనుగోలు జరగడంలేదు. జట్టు సైతం దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు ఏర్పాటు చేయకపోతే రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

జట్టు బిల్లుపై స్పష్టత లేదు

దూడే కేశవ, రైతు, బొమ్మిడి

15 ఎకరాల్లో వరి సాగు చేశాను. మాసూలు చేసి ఆరబెట్టి 40 కిలోల బరువుగలవి 900 బస్తాలు విక్రయించాను. ధాన్యం సొమ్ముకు సంబంధించి ట్రక్కుషీటు ఇచ్చారు. జట్టు కూలీల ఖర్చు 75 కిలోల బస్తాకు రూ.22 వరకూ అయ్యింది. ట్రక్కుషీట్‌లో చూపలేదు. ఎవరిని అడిగినా సరైనా సమాధానం రావడం లేదు. లారీ మామూలు రూ.1300 సైతం రైతులే చెల్లిస్తున్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ, ఎరియర్ల బకాయిలు విడుదల చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరుజిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన ధర్నా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ ఎరియర్లు, సరెండర్ లీవులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు సుదీర్ఘకాలంగా చెల్లించడం లేదన్నారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మార్చి 2022 నాటికి చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకూ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. జులైలో కొద్దిపాటి పిఎఫ్ మొత్తం ఇవ్వడం తప్ప మిగిలిన ఆర్థిక బకాయిలు ఇంతవరకూ చెల్లించలేదని, పలుమార్లు కోరినా బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సంబంధిత బకాయిలు రూ.1826 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెఎసి నాయకులు ఆర్ఎస్ హరినాథ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. జెఎసి కార్యదర్శి చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ వివాహ, ఆసుపత్రి ఖర్చులు వంటి అత్యవసర సందర్భాలకు అందాల్సిన సొమ్ములు అందక ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్‌వి.సాగర్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ పిఎఫ్ బకాయిలు సుమారుగా రూ.30 కోట్లు, ఎపిజిల బకాయిలు రూ.20 కోట్లు, డిఎలు, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లుల మొత్తం రూ.65 కోట్లతో మొత్తం ఈ జిల్లాలో రూ.115 కోట్లు ఉమ్మడి జిల్లాగా బకాయిలున్నాయని తెలిపారు. అనంతరం డిఆర్ఒ సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, జెఎసి నాయకులు నెరుసు రామారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.శ్రీదేవి, ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, కోశాధికారి షేక్ ముస్తాఫా అలీ, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరావు, యుటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పి.జయకర్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధానకార్యదర్శి ఎకెవి.రామభద్రం, గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు, కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, కార్యదర్శులు జి.రాజేంద్రప్రసాద్, ఎంవి.అప్పారావు, ఎస్.సుధారాణి, బివి.రవీంద్ర, ఎన్.రాంబాబు, పి.క్రాంతికుమార్, జి.లక్ష్మీనారాయణ, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్, ఏలూరు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.బేతాళరావు, ఏలూరు జిల్లా సిపిఎస్ కన్వీనర్ కె.కమల్‌కుమార్ ఈ ధర్నాలో ప్రసంగించారు.

ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలలో డివైఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను నూజివీడు డివైఇఒ సేవియానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కెఎల్.రావు, అబ్దుల్‌కాలం వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులకు బోధన విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డివైఇఒ

మెడికల్ రిప్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రెండు రోజులు పాటు జరుగుతున్న ధర్నాలో ఏలూరు మెడికల్ రిప్స్ పాల్గొన్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న ఏలూరు మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బివివి.సత్యనారాయణ, సిహెచ్.సీతయ్య ఆ వివరాలను తెలిపారు. సేల్స్ ప్రమోషన్స్ సర్వీస్ కండిషన్ (ఎస్‌పిఇ) చట్టం- 1976ను పరిరక్షించాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందరికీ అందుబాటులో ఉండేలా మందుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లైఫ్ సేవింగ్ డ్రగ్స్, మెడికల్ డివైజ్‌లపై జిఎస్‌టి మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వరంగ ఔషధాల కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్‌లపై యాజమాన్యాల వేధింపులను ఆపాలని వారు డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టం చేసి, ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఈ ధర్నాలో ఏలూరు నుండి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు అంథోని, చెన్నకేశవరావు, సోమేశ్వరరావు, ఉమా మహేష్, పురుషోత్తం, మొహిద్దిన్ పాల్గొన్నారు.

ప్రశాంతిని పరామర్శిస్తున్న డిఎన్‌విడి.ప్రసాద్

ఎఎన్‌ఎంకు సిఐటియు నేత పరామర్శ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

లారీ ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు కోల్పోయిన సచివాలయ ఎఎన్‌ఎం పి.దుర్గాప్రశాంతిని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక లలితప్రియ హాస్పిటల్‌లో సచివాలయ ఎఎన్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భాగ్యలక్ష్మి కార్యదర్శి టి.శ్రీలక్ష్మి, కోశాధికారి త్రివేణి, సిఐటియు మండల కార్యదర్శి ఎస్.రాంబాబుతో కలిసి ప్రశాంతిని పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు కింది స్థాయి ఉద్యోగులపై పనిఒత్తిడి తీవ్రంగా పెంచుతున్నారన్నారు. బయోమెట్రిక్ వేయాలనే హడావిడిలో బైక్ ప్రమాదం జరిగి ప్రశాంతి రెండు కాళ్లు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ప్రశాంతికి అన్ని రకాల వైద్య చికిత్సలు ప్రభుత్వం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైతులను వణికిస్తున్న వర్షాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వాతావరణ మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. మూడు రోజులుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుని చలిగాలులు వీచడంతో పాటు చిరుజల్లులు పడటంతో మండలంలోని రైతులు కోసిన వరిపైరును రక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 200 ఎకరాల్లో పైరు పనలపై ఉంది. దీంతో రెండు రోజులుగా పడుతున్న చిరుజల్లులతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పనలపై ఉన్న పైరును కూలీలతో బయటకు తీసుకువచ్చి మాసూలు చేస్తున్నారు. చేతికి వచ్చిన పంట దక్కకుండా పోతుందేమోననే భయంతో రైతులు పనలపై ఉన్న పైరును రక్షించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముదినేపల్లి, చిగురుకోట, వడాలి, నరసన్నపాలెం, పెదకామనపూడి, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో యంత్రాలతో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. వర్ష భయంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతూ వరిపైరును రోడ్లపైకి కూలీలతో తీసుకువచ్చి ట్రాక్టర్లతో నూర్పిళ్లు చేస్తూ పంటను రక్షించుకునే పన్నుల్లో నిమగ్నమయారు.

ఉంగుటూరు:బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మూలిగే నక్క మీద తాటిపండు పడిన చందంలా ధాన్యం రైతుల పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో సాంకేతిక సమస్యలు ఒక పక్క, సరిపడు లారీలు లేక మరోపక్క ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. దీంతో చిన్నపాటి వర్షానికి ధాన్యం తడిసిపోతుందని వాపోతున్నారు. ఉంగుటూరు మండలంలో 24వేలకు పైగా ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఇప్పటి వరకూ 19,800 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యి 53,499 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అందులో ఇప్పటి వరకూ 25 ఆర్‌బికేల ద్వారా కేవలం 12,339 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలుచేశారు. 5,86,380 సంచులను రైతులకు ఇప్పటి వరకు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో ధాన్యం సంచుల్లో పట్టి వారం రోజులు దాటినా పలు కారణాల వల్ల మిల్లులకు చేరకపోవడంతో రైతులు వాటికి కాపాలాగా కల్లాల వద్ద ఉంటున్నారు. చినుకుల నుంచి రక్షణకు బరకాల కొరత వేధిస్తోందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు చేరవేసేలా రవాణా సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ముదినేపల్లిలో రైతుల పాట్లు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని టి.నరసాపురం, మక్కినవారిగూడెం, కె.జగ్గవరం సొసైటీలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా వరికి గిట్టుబాటు ధర కల్పిస్తుందని తెలిపారు. గ్రేడ్ ఎ రకం క్వింటాళ్లకి రూ.2060, కామన్ రకం క్వింటాళ్లకి రూ.2040 మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ధాన్యం 17 శాతం తేమ ఉండేటట్లు ఆరబెట్టాలన్నారు. మండలంలో ధాన్యం సేకరణకు 20 వేల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, సొసైటీ ఛైర్‌పర్సన్లు దేవరపల్లి ముత్తయ్య, వాసిరెడ్డి మధు, పిన్నమనేని చక్రవర్తి, కేతవరం సర్పంచి తడికలపూడి శివ మాధవి కిషోర్, ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు, రైల్వే మెంబరు వంటిపల్లి వెంకటేశ్వరరావు, సొసైటీ పర్సన్లు, సిఇఒలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి సూరిబాబు

'స్పందన' ఫిర్యాదులు 82.92 శాతం పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. జిల్లాల పునర్విభజన అనంతరం 4 ఏప్రిల్ 2022 నుంచి 22 నవంబర్ 2022 వరకు ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 16158 ఫిర్యాదులు నమోదు కాగా ఇందులో 13397 (82.92 శాతం) ఫిర్యాదులు పరిష్కరించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. 1204 (7.46 శాతం) ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నాయని మరో 1554(9.62శాతం) ఫిర్యాదులు రీ-ఓపెన్ కాగా అందులో 1534 పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం మీద స్పందనలో 95.56 శాతం ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయం గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి సుమారు 250 నుంచి 300 వరకు వినతులు సమర్పించేందుకు విచ్చేయుచున్నారని తెలిపారు. స్పందన అర్జీ సమర్పించిన ప్రతి ఫిర్యాదు దారునికీ స్పందన రశీదు ఇవ్వనున్నట్లు చెప్పారు. స్పందన కార్యక్రమంలో నమోదైన ప్రతి ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. రీ ఓపెన్ ఫిర్యాదుల పరిష్కార విషయమై సంబంధిత శాఖ ఉన్నతాధికారి, రెవెన్యూ శాఖకు చెందిన ఫిర్యాదుల విషయమై సంబంధిత సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజినల్ అధికారి క్షేత్ర స్థాయిలో పర్యటించి, విచారణ జరిపి సంబంధిత అధికారి సంతకంతో విచారణ నివేదిక, ఫిర్యాదుదారునికి ఎండార్సుమెంటు ఇస్తున్నామని చెప్పారు. స్పందనలో వస్తున్న కొన్ని అర్జీల్లో న్యాయ స్థానాల్లో పెండింగ్ ఉన్న వివాదాలు, సివిల్ వివాదాలు, సంక్షేమ పథకాలకు అర్హత లేని ఫిర్యాదులు పరిష్కరించేందుకు వీలుపడటంలేదని, గమనించాలని తెలిపారు.

లే అవుట్ అనుమతుల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని గ్రామపంచాయతీల్లో లే అవుట్ అనుమతి కోసం ఎపిఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిఒ ఎంఎస్ 275 ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ప్లానులు, అవసరమైన పత్రాలు, తగిన ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారికి దాఖలు చేసుకోవాలన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉంచి అనుమతి పొందిన తర్వాత లే అవుట్ వేయాలని, అనుమతి పొందకుండా లే అవుట్ వేస్తే భూ యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనధికార లే-అవుట్‌లో విధమైన భవన నిర్మాణ అనుమతులు, ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించబడవని తెలిపారు. 2019, ఆగస్టు 31వ తేదీకి ముందు వేయబడిన అనధికార లేవుట్‌ల ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ పాటర్న్‌లు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారికి దాఖలు చేసుకొని, లే అవుట్ పాటర్న్ క్రమబద్ధీకరించుకోవాని తెలిపారు.

హోమియో వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పంకజాక్షన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు అగ్రహారం లోని హోటల్ ఎన్‌లో మంగళవారం నిర్వహించిన హోమియో వైద్యుల అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా ఏలూరుకు చెందిన పంకజ్ హోమియో క్లినిక్ వైద్యులు వికె.పంకజాక్షన్ ఎన్నికవ్వడం హర్షణీయమని లయన్స్ జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు. డాక్టర్ పంకజ్ హోమియో క్లినిక్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో లయన్స్ ద్వితీయ వైస్ గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడుతూ డాక్టర్ పంకజ్ మంచి హోమియో వైద్యులుగా పేరు ప్రఖ్యాతలు పొందడమే కాకుండా లయన్స్ జిల్లా గవర్నర్‌గా కూడా విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ పంకజ్ స్వైన్‌ఫ్లూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో హోమియో మందులను జిల్లా వ్యాప్తంగా లక్షలాదిమందికి అందించి మానవ సేవయే మాధవ సేవ అని తన దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పంకజ్ మాట్లాడుతూ సమాజంలోని నలుగురికి మంచి చేయాలనే సంకల్పంతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్‌కు జిల్లా గవర్నర్‌గా ఎన్నుకున్నందుకు, అలాగే ఆలిండియా హోమియోపతి అసోసియేషన్‌కి రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వల్లెపు వెంకటస్వామి, మద్దుకూరి శ్రీహరి, కోశాధికారి చిట్టూరు శ్రీనివాసరావు, జిల్లా గాట్ మార్కెటింగ్ కోఆర్డినేటర్ ఎల్.వెంకటేశ్వరావు, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ వై.వెంకటబాలాదిత్య, లయన్స్ సభ్యులు శ్రీహరి శివప్రసాద్, గీతా పంకజ్ పాల్గొన్నారు.



వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంకజాక్షన్‌ను సన్మానిస్తున్న వక్తలు

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ఐక్యతతోనే అభివృద్ధి : డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగవంతంగా రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం ప్రజా ప్రతినిధులుగా మన బాధ్యత అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం 16వ వార్డులో రూ.3.25 లక్షల పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నవరత్నకుమారి, వార్డ్ మెంబెర్లు బెల్లాని శ్యామలారావు, తోట మహేష్, సానా శ్రీను, దండే రవిప్రకాష్ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని శివాలయం సమీపంలో బుట్టాయగూడెం నుంచి కన్నాపురం వరకు రహదారి మరమ్మతు పనులకు పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాష్ట్రంలోనూ రహదారుల మరమ్మతులు, నూతన రహదారులను నిర్మిస్తున్నామని తెలిపారు. బుట్టాయగూడెం హైస్కూల్ నుంచి జంగారెడ్డిగూడెం వరకు రహదారి పనులను మరమ్మతు పనులను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తెల్లం వెంకాయమ్మ, ఆరేటి సత్యనారాయణ, జి.మోహన్, వై.రవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో స్థానిక ఏలూరులోని రవితేజ చిల్డ్రన్ వసతి గృహంలో మంగళవారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరంలో 45 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. 45 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి కళ్లజోళ్లు పడ్డాయని, ఒకరిని రిఫర్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.బెన్నీ, కడియాల కృష్ణారావు, రవితేజ చిల్డ్రన్ హోమ్ ఫౌండర్ అయిక రాజు, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి రిప్కా, ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పామును పట్టుకున్న స్నేక్ సేవియర్

ఆసుపత్రిలో పాము హల్‌చల్

అడవిలో వదిలిన స్నేక్ సేవియర్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రవేశించిన జెర్రిపోతు పామును స్నేక్ సేవియర్ పట్టుకున్నారు. సొసైటీ వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం... పాము ఆసుపత్రి ప్రాంగణంలో కనిపించగా జంగారెడ్డిగూడెం సమీపంలోని స్నేక్స్ సేవియర్ సొసైటీ వారికి సమాచారం అందించారు. స్నేక్స్ సేవియర్ సొసైటీ వారు హాస్పిటల్‌కి చేరుకొని పామును పట్టుకున్నారు. అయితే ఈ పాము జెర్రిపోతూ పామని దీనివల్ల ఎటువంటి హాని ఉండదని తెలిపారు. పట్టుకున్న ఈ పామును స్నేక్స్ సొసైటీ వారు సురక్షిత ప్రాంతాల్లో వదిలిపెడతారని తెలిపారు.

ధాన్యం రైతులకు మద్దతుగా ఆందోళన

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షణ చేయాల్సి వస్తుందని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.ధర్మరాజు అన్నారు. ధాన్యం సేకరణ సమస్యలపై రైతులకు మద్దతుగా మంగళవారం ఉంగుటూరు రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల చుట్టూ సంచుల కోసం తిరుగుతున్నారని, మరోపక్క వాతావరణం అనుకూలంగా లేకుండా వర్షపు జల్లులు పడుతూ మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. వర్ష ప్రభావం వల్ల తేమశాతం నిబంధన లేకుండా ధాన్యం సేకరించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆర్థిక ఇబ్బందులు భరించలేక పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం భద్రాచలం కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని ముండివర్రె గ్రామానికి చెందిన బెల్లంకొండ రాఘవేంద్రరావు ప్రయివేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ ఉద్యోగం కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఈ నెల 12న మండలంలోని గంగినీడుపాలెంలో తన అత్తగారి ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. దీంతో బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ మెట్రో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 21వ తేదీన డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో స్పృహ కోల్పోవడంతో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య శిరిష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. రాజమండ్రి దేవిచౌక్ లక్ష్మీవారపుపేటకు చెందిన అనుసూరి సత్యతేజకు, పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌కు చెందిన అనుసూరి ఆశకు 2020లో వివాహమైంది. ఈ క్రమంలో అదనపు వరకట్నం, అస్తి అమ్ముకు రావాలని భర్తతో పాటు అత్త మామ, బంధువులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఆశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చింతలపూడి

అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలో పి.చంద్రయ్య వద్ద అక్రమంగా నిల్వ ఉన్న రూ.2,500 కేజీల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడి పట్టుకున్నారు. ఈ దాడిలో సివిల్ సప్లై డిటి ఎస్‌కె.మాలిక్ జరినా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రైతులకు ఇబ్బందిలేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ముదినేపల్లి సర్వసభ్య సమావేశంలో ఎంపిపి సత్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ధాన్యం కొనుగోలు చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా రామిశెట్టి మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల ధాన్యం తేమ శాతం 17 పైగా ఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జలవనరుల శాఖ ఎఇ సిద్ధార్థ మాట్లాడుతూ రెండో పంట దాళ్వా రద్దు చేయడం జరిగిందన్నారు. రైతులు ఎవరూ దాళ్వా పంటకు సన్నద్ధం కారాదన్నారు. డిసెంబర్ ఐదో తేదీ వరకు మాత్రమే పంట కాల్వలకు నీరు వస్తుందని, అనంతరం కాల్వలకు నిలిచిపోతోందన్నారు. ఈ లోగా సర్పంచులు తమ గ్రామాల్లోని మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారి బొర్రా మాధవ్ మాట్లాడుతూ మండలంలో 15వేల ఎకరాల్లో సార్వా వరి సాగు రైతులు చేశారని, 900పై చిలుకు ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 574 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. తహాశీల్దార్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న భూరీసర్వేకు రైతులంతా సహకరించాలన్నారు. రైతులు వారి భూ సరిహద్దులు చూపించి సర్వేకు అవసరమైన ఆధార్, సంబంధిత పత్రాలు గ్రామ విఆర్ఒ, లేక సర్వేయర్‌కు అందించాలన్నారు. ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మాట్లాడుతూ అన్నవరం జగనన్న లేఆవుట్‌లో రహదారి సౌకర్యం సరిగాలేని కారణంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసేందుకు ముందుకు రావడంలేదన్నారు. వెంటనే రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపిని కోరారు. దీనిపై ఎంపిపి స్పందిస్తూ వర్షాల కారణంగా రోడ్లు సరిగాలేవని, సమస్య పరిష్కరిస్తామన్నారు. పేరూరు సర్పంచి మాట్లాడుతూ పోల్‌రాజ్ డ్రైయిన్‌పై పడిపోయిన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై సభలో చర్చించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, డైరెక్టర్ గంటా సంధ్య, విద్యుత్ శాఖ ఎఇ పి.రవికుమార్ వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన వంతెన పనులు



అధికారులతో మాట్లాడుతున్న పరమేష్‌కుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రౌతుగూడెం సమీపంలో చింతలపూడి ఎత్తిపోతల పథకంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణాన్ని నా బార్డ్ ఎజిఎం పరమేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కొన్ని నెలలుగా బిల్లులు లేక వంతెన నిర్మాణ పనులు ఆగిపోవడంతో నిర్మాణ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు టెక్నికల్ కన్సల్‌టెంట్ ఐఎస్ఎన్.రాజు, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ఎస్ఇ శ్రీరామకృష్ణ, ఇఇ కృష్ణయ్య, గాయత్రి ఏజెన్సీ జిఎం.శ్రీనివాస్, డిఇ శ్రీనివాస్, ఎఇలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరిపీ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు ప్రతి నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని పిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. ముసునూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ఫిజియోథెరిపీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్.హాన్నమణి, ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యం అలవర్చుకుని భవిష్యత్తులో దేశానికి మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదించాలని ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులు బంగారమ్మ, వెంకటేశ్వరరావు, యువరాజు అల్లాబిక్షు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం సైన్సు ఫెయిర్ నిర్వహించారు.

ఎఎన్ఎం ప్రశాంతికి టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకొని చికిత్స పొందుతున్న ఎఎన్ఎం పి.దుర్గాప్రశాంతిని మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు గొడవర్తి విద్యాసాగర్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ రాజశేఖర్‌కు తెలిపారు. ఆయనతో పాటు కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు జేష్ట రామకృష్ణ, కన్నాపురం గ్రామపంచాయతీ మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు, కన్నాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు గంటలయ్య, చాపల చిన్నబాబు, బొబ్బర చిన్నరాజు, సంకు కృష్ణబాబు ఉన్నారు.

'ప్రతిభ' విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



బహుమతులు సాధించిన విద్యార్థులు

గ్రంథాలయ 55వ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 29 బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపల్ కె.లక్ష్మీసరోజారెడ్డి తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన, వృక్తత్వం, చదరంగం, లెమన్ స్పూన్ పోటీల్లో 29 బహుమతులు కైవసం చేసుకున్నారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజలో కార్తీక మాసం సందర్భంగా శివాలయం ఛైర్మన్ మీసాల రామకృష్ణ, గ్రామస్తులు మంగళవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్‌ఎంపిపిలు సునీత, రాధా, గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, పిఎసిఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచి పి.కిరణ్మయి, కె.విష్ణువర్ధన్, ఎం.వసంతరావు సాయి, దివి సతీష్, పేర్ని పృధ్వి, రాచూరి కుమార్, బి.శేషుబాబు, ఎ.రాంబాబు, పుట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

కార్తీకమాసం ఉత్సవాల్లో జయమంగళ

కైకలూరు రూరల్ : నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో కలిసి మెలిసి ఉండాలని మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ తెలిపారు. మండలంలోని గోనెపాడులో కార్తీక మాస వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. భక్తులకు వడ్డన చేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, గ్రామ సర్పంచి బత్తిన శ్రీకాంత్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్, మాజీ సర్పంచి మధు సత్యనారాయణ, కైకలూరు పట్టణ అధ్యక్షులు ఎండి జానీ, బొర్రా వెంకట్, నంగెడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక మాస శివరాత్రి మహాన్యాస పూర్వ ఏకాదశి సందర్భంగా లక్ష బిల్వార్చన, ఏకాదశి రుద్రభిషేకం చేశారు. అనంతరం ఆలయ ఇఒ వై.సీతారామయ్య ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆధార్ కార్డు అప్‌డేట్, మార్పులు చేర్పులు చేసుకునేందుకు బుధవారం, గురువారం మండలంలోని పి.అంకంపాలెం, స్వర్ణవారిగూడెం, సచివాలయల పరిధిలో రెండు రోజుల పాటు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ కె.మంగతాయారు తెలిపారు. శుక్రవారం 25న కామయ్యపాలెం, పి.రాజవరంలో కూడా నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేసుకునేవారు, ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకునేవారు, 2010 నుంచి 2016 సంవత్సరాల మధ్య ఆధార్‌నమోదు చేయించుకుని తర్వాత ఆధార్ కేంద్రాల్లో ఒక్కసారి కూడా అప్‌డేట్ చేయించుకొని వారు విధిగా ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు.

భీమడోలు : గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ సచివాలయాల వద్ద ఈ నెల 23, 24, 25వ తేదీల్లో ప్రత్యేక ఆధార్ మైబైల్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. దీనిలో భాగంగా రెండో నెంబరు సచివాలయం వద్ద 23వ తేదీన, సిఎస్ఐ పాఠశాల వద్ద 24వ తేదీన, మూడో నెంబర్ గ్రామ సచివాలయం వద్ద 25వ తేదీన ఆధార్ ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. శిబిరంలో ఆధార్ కార్డులో తాజా వివరాలను చేయటం, మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్ నమోదు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమ పర్యవేక్షకులుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఒకటో నెంబర్ సచివాలయానికి చెందిన డిజిటల్ సహాయకులు వ్యవహరిస్తారని తెలిపారు.

టిడిపి నేత వెంకటరమణ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం టిడిపి వ్యవస్థాపక సభ్యులు, ఎంపిటిసి మాజీ సభ్యులు, వేణుగోపాలస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ దొడ్డి వెంకటరమణ (58) అనారోగ్యంతో ప్రయివేట్ చికిత్స పొందుతు పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని టిడిపి సీనియర్ నాయకులు ఎస్‌కె.ముస్తఫా తెలిపారు. 1982లో టిడిపి ఏర్పడక ముందు నుంచి ఎన్‌టిఆర్ అభిమానిగా ఉంటూ టిడిపిలో క్రియాశీలక పాత్ర పోషించి పార్టీని ముందుకు నడపడంలో తన పాత్ర పోషించిన వ్యక్తి వెంకటరమణ ఆయన గుర్తు చేశారు. వెంకటరమణ మృతదేహాన్ని టిడిపి పట్టణ అధ్యక్షులు రావురి కృష్ణ, రూరల్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, మండవ లక్ష్మణరావులతో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



కొయ్యలగూడెంలో...

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి గెలుస్తుందని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పొంగుటూరు గ్రామంలో సర్పంచి పసుపులేటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సమస్యలను అడుగుతూ వారితో మమేకమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పశ్చిమ డెల్టా బోర్డు చైర్‌పర్సన్ గంజిమాల దేవి, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, ఎంపిటిసి సభ్యులు నేలపోలు దుర్గారావు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని పర్వతాపురంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు పర్వతాపురం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందిరకీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలువురు ఎంఎల్ఎ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. గృహ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు, ఇళ్ల స్థలాలు అందడంలేదని పలువురు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మిద్దె శివరామకృష్ణ, ఎంపిపి లంక నిర్మల, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేసిరెడ్డి రాఘవరెడ్డి, ప్రభుత్వ అధికారులు, కార్యదర్శులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జనసేనపై విమర్శలు మానుకోవాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నరసాపురం సభలో సిఎం జగన్ మోహన్ రెడ్డి జనసేన పార్టీనీ రౌడీ పార్టీ అనడం హేయమైన చర్య అని జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికార ప్రతినిధి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డిఅప్పలనాయుడు అన్నారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నరసాపురంలో మాట్లాడుతూ జనసేన పార్టీ మీద జన సైనికుల మీద ఘోరమైన పదాలను ప్రయోగించారని, ఈ రాష్ట్ర ప్రజలకు తెలుసు ఏ పార్టీ వారు రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నారో అని అన్నారు. ఆర్థిక నేరస్థులు ఎవరో ఈ రాష్ట్ర ప్రజానీకానికి తెలుసునన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్ పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో 25 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో 25 వేల మంది యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం కార్తీ క మాస ఉత్సవాల నేపథ్యంలో మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి సుమారు లక్ష మంది యాత్రికులు తరలి వచ్చారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.7,39,155లు సమ కూరిందని తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికులకు సేవలందించడంలో పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ సరిత విజయభాస్కర్ రెడ్డి, పోలీస్, వైద్య సిబ్బంది పర్యవేక్షించారని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయానికి రూ.50 వేలు విరాళం

జంగారెడ్డిగూడెం : స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయానికి దాతలు రూ.50 వేల విరాళం అందించారని ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళి తెలిపారు. పట్టణానికి చెందిన కీసరి రామిరెడ్డి మమతా దంపతులు ముత్యాలమ్మకు స్వర్ణ వర్ణ కవచం నిమిత్తం రూ.50 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి ఘనంగా సత్కరించామని ఆలయ నిర్మాణ కర్త భవిరిశెట్టి మురళి దంపతులు తెలిపారు.

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No: 150/CMDF-Grant/2022-23, Dated. 22-11-2022
The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of CC Drain at SMR Nagar in Municipal Corporation, Eluru"** Total No. of work is **1** with an amount of Rs. **10.70** Lakhs.
Tender schedules are available on e-procurement market place from 23-11-2022. Last date of receipt of tenders is 28-11-2022. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).
Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

రైతులను ముంచిన వైసిపి : టిడిపి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రైతులను నట్టేట ముంచిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని టిడిపి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. మంగళవారం ఆమె నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులను వైసిపి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెడుతుందన్నారు. దేశానికి రైతు వెన్నెముక అనే విషయాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిబంధనలను సరళీకృతం చేయాలన్నారు. రైతులు వద్ద నుంచి తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ మహిళ అధ్యక్షులు చెరుకూరి రమ్య, మండల ఉపాధ్యక్షురాలు కాకి నాగలక్ష్మి, మహిళ నాయకులు మాధవి, రమ్య పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ చింతలపూడి అధ్యక్షులుగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - చింతలపూడి

నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ సంఘం మండల అధ్యక్షులు పరిమి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షునిగా పరిమి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పెర్ల నాగరాజు, మండల మాజీ అధ్యక్షులు డివి.గంగాధరరావు, మాజీ టౌన్ అధ్యక్షులు ఆచంట సాయి, మాజీ మండల సెక్రటరీ పారంపూడి మోహన్‌రావు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయం'

ప్రజాశక్తి - చాట్రాయి

జగన్మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజాధనాన్ని వృధా చేస్తూ గ్రామ సర్పంచులకు రావాల్సిన నిధులను తన ఖాతాకు మళ్లించుకుంటూ నియంతల వ్యవహరిస్తున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పడిపోయి, రానున్న ఎన్నికల్లో టిడిపి పూర్తి మెజార్టీతో గెలుపొంది రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపిస్తుందన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జుడిషియల్ ఫస్టు క్లాసు మెజిస్ట్రేట్ వారి కోర్టు, తాడేపల్లిగూడెం
O.S. 593/2021
బిట్వీన్:
నీలం నాగ అయ్యప్పస్వామి -వాది
మరియు
తన్నిడి నాగ వెంకట మణికుమార్ -ప్రతివాది
ప్రతివాది: తన్నిడి నాగ వెంకట మణికుమార్, S/o. రాంబాబు, ఇంటి నెం. 4-167-3, 1వ వార్డు, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా - 534101.
పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 29-11-2022వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.
అద్దంకి విజయరత్నం, అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది.19-11-2022 సెల్:9290188928

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: ఏలూరు
ఇ.పి. నెం. 37/2019 ఇన్ ఒ.ఎస్. నెం. 65/2016
బిట్వీన్:
వేమా సత్యనారాయణ మరియొకరు
...పిటీషనర్స్ /డిక్రీ హోల్డర్స్
మరియు
పులిగోపాలరావు
...రెస్పాండెంటు /జడ్జిమెంటు డెటార్
పై నెంబరు వారంటు గ్రంథములో ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తులను పై కోర్టు వారి ఎదుట **ది.16-12-2022న ఉదయం గం॥ 10:30 ని॥లకు బహిరంగ వేలం వేయబడును.** సదరు వేలంలో పాల్గొనదలచిన వారు సదరు తేదీన పై కోర్టులో స్వయంగా హాజరై పాడుకొనవచ్చును. పాట షరతులు వగైరా విషయములను గురించి కోర్టు నజారత్ వారిని సంప్రదించగలరు.
SCHEDULE
In West Godavari District, Eluru Sub-Di, Eluru Mandal, Jalipudi Panchayat, Jalipudi Village.
Item No.1:
R.S.No. 281, Zirayati Wet Land admeasuring AC. 0-92 Cents Bounded by:
East: Land of Kola Prasad.
South: Land of Surat Rama Rao.
West: Land of Pydipati Rama Krishna.
North: Land of Bandi Srinivas.
Decree Holders Value : Rs.18,20,000/-
Amin Value : Rs. 23,92,000/-
Item No.2:
R.S.No. 295/1, Zirayati Wet Land admeasuring AC. 1-00 Cents Bounded by:
East: Road.
South: Land of Thoomu Ramu.
West: Land of Thota Aadhi Lakshmi.
North: Land of Badarala Satyanarayana.
Decree Holders Value : Rs.20,00,000/-
Amin Value : Rs.26,00,000/-
గమనిక: వేలంలో పాల్గొనదలచిన పాటదార్లు పై వేలపు తేదీన వారియొక్క ఆధార్ కార్డుతో హాజరై వారి యొక్క అఫిడవిట్ దాఖలు చేయవలయును. వేలం ముగిసిన వెంటనే Successful పాటదారు తను పాడిన మొత్తంలో 1/4వ వంతు సొమ్ము శ్రీవారి కోర్టులో డిపాజిట్ చేయవలయును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
కోరుకొండ రాజారామమోహన్,
జి.వి.రమణమూర్తి,
ఏలూరు, డిక్రీ హోల్డర్స్ తరపు న్యాయవాదులు,
13-11-22. అగ్రహారం, ఏలూరు.
సెల్:9440420223